## క్లుప్తంగా

### బాల్య వివాహాలపై తీర్పు చారిత్రాత్మకం

**శ్రీకాళహస్తి:** బాల్యవివాహాలపై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకమని ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ అన్నారు. ఆయన శనివారం మాట్లాడుతూ బాల్య వివాహం పిల్లల హక్కులను దోచుకుంటాయని, బాల్య వివాహాలు జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛను ఉల్లంఘించడమేనని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు కఠిన చట్టాలను అమలు చేసేందుకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను విడుదల చేయడం హర్షణీయమన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.

### నాయీ బ్రాహ్మణులను ఆదుకోండి

**శ్రీకాళహస్తి:** పట్టణ పరిధిలోని నాయీ బ్రాహ్మణులను కాపాడాలని ఆ సేవా సంఘం కొత్తపట్నం మహేంద్ర ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని కోరారు. ఈమేరకు శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణ వ్యాప్తంగా 120 దుకాణాలు ఉన్నాయన్నారు. వీటిని నమ్ముకుని 500 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. అయితే గత కొద్ది రోజులుగా కొంతమంది కార్పొరేట్ స్థాయిలో కొన్ని పెద్దపెద్ద సెలూన్లు పెట్టి నాయీ బ్రాహ్మణుల కడుపు కొడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

### కుక్కంబాకంలో భూసర్వే


సర్వే చేస్తున్న సర్వేయర్లు

**బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలోని కుక్కంబాకం గ్రామ రెవెన్యూలోని సర్వే నంబరు 81 లోని 82 ఎకరాల భూసమస్య సర్వే తీరుతుందని తహసీల్దారు సుబ్రమణ్యం తెలిపారు. శనివారం సర్వేయర్ రాజ్‌కుమార్, సచివాలయాల సర్వేయర్లతో కలసి ఈ భూమి సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా ఈ భూమిపై తగాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ భూమిలోని 39 ఎకరాలను బుచ్చినాయుడుకండ్రిగ గ్రామానికి చెందిన ముగ్గురు సాగు చేసుకుంటుండగా, మిగిలిన 43 ఎకరాలను కుక్కంబాకం దళితులు సాగు చేసుకుంటున్నారని అన్నారు. ఎవరి సాగులో ఎంత భూమి ఉందనే విషయం సర్వే ద్వారా తెలిసిందన్నారు. సర్వేతో భూసమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

### ముక్కంటి సేవలో ఎక్సైజ్ కమిషనర్

**శ్రీకాళహస్తి:** జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశీష్‌కుమార్ దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన ప్రత్యేక రాహుకేతు పూజలను చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయనను ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

### సీసీ రోడ్లకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న సర్పంచ్, అధికారులు

**బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలోని కనమనంబేడు గ్రామంలో శనివారం పల్లెపండుగలో భాగంగా సీసీరోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జనార్దన్ మాట్లాడుతూ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీరోడ్లు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు సుధాకర్‌నాయుడు, మధునాయుడు, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

### చెత్తను తొలగించండి


సంతలో వ్యాపారులు వదిలి వెళ్లిన చెత్త

**బుచ్చినాయుడుకండ్రిగ:** మండలకేంద్రంలోని తెలుగుగంగ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సంతలో వ్యాపారులు చెత్తను వదిలేసి వెళ్లారు. దీంతో కార్యాయల సిబ్బంది, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అక్కడ పడేసి వెళ్లిన కూరగాయలు కుళ్లి దుర్గంధం వెదజల్లుతుండడంతో ముక్కులు మూసుకుని కార్యాలయ సిబ్బంది విధులు నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది స్పందించి చెత్తను తొలగించాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి

**శ్రీకాళహస్తి:** పట్టణంలోని చెంబేడు కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం వెలుగు చూసింది. శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వర్లు కథనం.. చెంబేడు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ఒడ్డుకు తీసి పంచనామా నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

# పల్లె తడబడి

పాండూరు హైస్కూల్లో నాడు–నేడు ద్వారా నిర్మించి అర్ధంతరంగా ఆగిన పనులు





కార్పొరేట్‌కు దీటుగా ఆధునిక వసతులతో అలరారిన ప్రభుత్వ పాఠశాలలు నేడు అవస్థలతో అల్లాడుతున్నాయి. స్కూళ్లలో వసతులు కరువు.. మిథ్యగా మధ్యాహ్న భోజనం.. అదృశ్యమైన అంతర్జాతీయ ప్రమాణాలు.. ఆగిన నాడు– నేడు పనులు.. వెరసి ప్రభుత్వ విద్యావ్యవస్థ కునారిల్లుతోంది. కూటమి ప్రభుత్వం మద్యానికి ఇచ్చిన ప్రాధాన్యత విద్యకు ఇవ్వకపోవడంపై విద్యావేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- కొండెక్కిన నూతన సంస్కరణలు
- నాణ్యత లోపించిన మధ్యాహ్న భోజనం
- బైజూస్, టోఫెల్ కరికులానికి మంగళం

**రేణిగుంట:** కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులపై సవతి తల్లి ప్రేమ చూపుతోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చాలని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను పేదలకు చేరువ చేసేందుకు ప్రభుత్వస్కూళ్లలో ఐఎఫ్‌పీ ప్యానల్స్, ట్యాబ్‌లు, ఐబీ కరికులం సదుపాయాలెన్నో కల్పించింది. కార్పొరేట్ పాఠశాలల్లో వసతులను తలదన్నే రీతిలో 'నాడు–నేడు' పథకాన్ని తీసుకొచ్చి అధునాతన వసతులను కల్పించారు. ప్రస్తుతం అవన్నీ కనుమరుగయ్యాయి. పేద విద్యార్థులు మళ్లీ సమస్యల చట్రంలో ఇరుక్కునే పరిస్థితులు నెలకొన్నాయి.

**శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పరిస్థితి ఇదీ..**

శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేట్ ఏజెన్సీ నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నారు. శనివారం కావడంతో అన్నం, ప్రసాదం, ముల్లంగి కూరను విద్యార్థులకు మధ్యాహ్న భోజనంగా అందించారు. నాసిరకమైన చిక్కీలను అందజేస్తున్నారు. మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. పాఠశాలలోని మరుగుదొడ్లు దుస్థితికి చేరుకున్నాయి. మరుగుదొడ్లు పరిశుభ్రం చేసే ఇద్దరు ఆయాలకు 3 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. ఫినాయిల్, బ్లీచింగ్, బ్రెష్‌లు సక్రమంగా ప్రభుత్వం అందించడంలేదు.

- రేణిగుంట మండలంలో మెజారిటీ పాఠశాలలకు తిరుపతి ఇస్కాన్ టెంపుల్ నుంచి మధ్యాహ్న భోజనం వస్తోంది. అయితే ఆ భోజనం నాణ్యత, రుచి అంతంతమాత్రంగా ఉండడంతో విద్యార్థులు ఇంటి నుంచి క్యారియర్ తెచ్చుకుని తింటున్నారు.
- రేణిగుంట మండలం జీపాళెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో కోతులు ఎక్కువగా ఉండడంతో తలుపులు మూసుకుని క్లాసులు నిర్వహిస్తున్నారు.
- ఏర్పేడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాసిరకం బియ్యంతో తయారు చేసిన భోజనాన్ని పిల్లలకు వడ్డిస్తున్నారు.

**వరదయ్యపాళెం:** సత్యవేడు నియోజకవర్గంలో విద్యావ్యవస్థ చతికిల పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, అనుకూల వర్గీయులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల్లో నియమించుకున్నారు. కొన్నిచోట్ల మధ్యాహ్న భోజన కార్మికులను తమ వర్గీయులనే బలవంతంగా నియమించుకున్నారు. సత్యవేడు నియోజకవర్గంలో 394 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఈ స్కూళ్లలో 25,794 మంది విద్యను అభ్యసిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యత లేకపోవడం, మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోవడం, ఆయాలకు వేతనాలు లేకపోవడం తదితర సమస్యలు వేధిస్తున్నాయి.

**నాణ్యత కొరవడిన మధ్యాహ్న భోజనం**

గత ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పేరిట ఎంతో ప్రాధాన్యత కల్పించి రోజుకో మెనూతో పేద పిల్లల కడుపు నింపేది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ పథకానికి పేరు మార్చి నాణ్యత లోనూ నీరుగార్చింది. దీంతో నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో 20 శాతానికి పైగా పిల్లలు ఇంటి నుంచి తెచ్చుకునే క్యారియర్లను తినాల్సిన దుస్థితి నెలకొంది.

**అందని నిర్వహణ బిల్లులు**

పాఠశాలల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం అందించే బిల్లులు ఈ ఏడాది ఇప్పటి వరకు అందలేదు. దీంతో పాఠశాలల నిర్వహణకు సంబంధించి చాక్‌పీస్‌లు, ఇతర కనీస వసతులు సమకూర్చేందుకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అష్టకష్టాలు పడుతున్నారు.

**వరదయ్యపాళెంలో మరుగుదొడ్ల సమస్య**

మండల కేంద్రమైన వరదయ్యపాళెం హైస్కూల్‌లో 800 పైచిలుకు విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే అక్కడ మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో లేవు. దీంతో బాలికలు మలమూత్ర విసర్జనకు సమీపంలోని శిథిలావస్థకు చేరుకున్న పోలీస్ క్వార్టర్స్ సమీపంలోకి బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

**మరుగునపడిన నాడు–నేడు పనులు**

సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో గత ప్రభుత్వంలో 333 పాఠశాలలను రూ. 38.23 కోట్లతో ఆధునీకరించింది. అయితే కొన్నిచోట్ల పెండింగ్‌లో ఉన్న పనులను ప్రస్తుత కూటమి ప్రభుత్వం పక్కన పెట్టింది. అంతేకాక వసతులు లేని పాఠశాలల గురించి ఏమాత్రం పట్టించుకోలేదు.

**బుచ్చినాయుడుకండ్రిగలో..**

మండలంలో 61 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ప్రాథమిక పాఠశాలు–51, ప్రాథమికోన్నత పాఠశాలలు –5, ఉన్నత పాఠశాల–5, లలో విద్యార్థులు– 3351 మంది చదువుకుంటున్నారు. 14 పాఠశాలలో మరుగుదొడ్ల సౌకర్యం అంతంతమాత్రంగానే ఉన్నాయి. పలు పాఠశాలలో నీటి వసతి లేదు. రెండవ విడత నాడు–నేడు చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలిపోయి ఉన్నాయి. ఆయాలుకు సక్రమంగా జీవితం చెల్లించడం లేదు.

**శ్రీకాళహస్తి నియోజకవర్గం– గణాంకాలు**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని మొత్తం పాఠశాలల వివరాలు:

| మండలం | ప్రైమరీ,యూపీ | ఉన్నత | విద్యార్థులు |
|---|---|---|---|
| శ్రీకాళహస్తి (టౌన్,రూరల్) | 98 | 15 | 10,674 |
| రేణిగుంట | 55 | 11 | 5,392 |
| ఏర్పేడు | 69 | 12 | 4,570 |
| తొట్టంబేడు | 64 | 10 | 3,208 |
| మొత్తం | 286 | 48 | 23,844 |

నియోజకవర్గంలో ఉపాధ్యాయ ఖాళీలు:

| | | |
|---|---|---|
| శ్రీకాళహస్తి | - | 79 |
| రేణిగుంట | - | 23 |
| ఏర్పేడు | - | 3 |
| తొట్టంబేడు | - | 31 |
| మొత్తం | - | 136 |

నాడు–నేడు వివరాలు:

| మండలం | మొత్తం స్కూళ్ల సంఖ్య | ఖర్చు చేసిన మొత్తం |
|---|---|---|
| శ్రీకాళహస్తి | 115 | రూ. 23.86కోట్లు |
| రేణిగుంట | 66 | రూ. 10.48కోట్లు |
| ఏర్పేడు | 69 | రూ. 18.10కోట్లు |
| తొట్టంబేడు | 65 | రూ. 7.5కోట్లు |
| మొత్తం | 315 | రూ.59.94కోట్లు |







ఏర్పేడు ఉన్నత పాఠశాలలో నాసిరకపు భోజనాన్ని విద్యార్థులకు పెడుతున్న వంట నిర్వాహకులు, ఏర్పేడు హైస్కూల్‌లో అధ్వాన్నంగా ఉన్న మరుగుదొడ్లు,వరదయ్యపాళెం మండలంలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు, నాగలాపురం వెస్ట్ ఎలిమెంటరీ స్కూల్‌లో కొళాయిలు లేని పరిస్థితి

## పిడుగుపాటు మృతులకు పరామర్శ


మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నూకతోటి రాజేష్

**నాగలాపురం:** పిచ్చాటూరు మండలం హనుమంతాపురం గ్రామంలో శుక్రవారం పిడుగు పడి ఇద్దరు మృతి చెందారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, నాయకులతో కలిసి గ్రామానికి చేరుకుని మృతదేహాలపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ కన్వీనర్ హరిచంద్ర రెడ్డి, నాయకులు కాలంకేరి సర్పంచ్ భూపతి, శేషన్, రితుసూదన్ రావు, అయ్యప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొల్లడంలో భూ సర్వే అడ్డగింత


కొల్లడంలో సర్వే బృందాన్ని అడ్డుకొని తహసీల్దార్‌తో మాట్లాడుతున్న రైతులు

- ఏపీఐఐసీకి భూములు కేటాయిస్తున్నారని రైతుల ఆరోపణ

**సత్యవేడు:** మండలంలోని కొల్లడం పంచాయతీలో రెవెన్యూ అధికారులు చేపట్టిన ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ సర్వేను కొల్లడం గ్రామ రైతులు అడ్డుకున్నారు. శనివారం ఆర్డీఓ కిరణ్మయి ఆదేశాలతో తహసీల్దార్ టీవీ. సుబ్రమణ్యం కొల్లడంలో భూరికార్డుల సర్వేను ఆరు బృందాలతో కలిసి ప్రారంభించారు. సమాచారం తెలుసుకున్న గ్రామ రైతులు రెవెన్యూ అధికారులను అడ్డుకున్నారు. తమ భూములు ఎందుకు సర్వే చేస్తున్నారని నిలదీశారు. కొల్లడం రెవెన్యూ పరిధిలో పట్టాభూములు, బీడు భూములు, డీకేటీ భూముల వివరాలు సేకరించేందుకు సర్వే చేస్తున్నామని, ఎఫ్‌ఎంబీకి, అడంగల్‌కి తేడా ఉన్న భూముల వివరాలు సేకరిస్తున్నామని తహసీల్దార్ తెలిపారు. ముందుగా గ్రామంలో గ్రామ సభ పెట్టి రైతుల ఆమోదంతో సర్వే చేయాలని, అలా కాకుండా తూతూమంత్రంగా దండోరా వేసిన గంటలోపే అధికారులు సర్వేలు చేయడం సమంజసం కాదన్నారు. భూముల సర్వేకు శ్రీసిటీ సీఐ బీవీ.శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్, కానిస్టేబుళ్లలను ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో మధ్యాహ్నం వరకు సర్వే ఆపారు. కొందరు రైతులు మాట్లాడుతూ భూములను ఏపీఐఐసీకి కేటాయించేందుకు సర్వేలు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం రైతులు ఇళ్లకు వెళ్లిపోవడంతో మధ్యాహ్నం రెవెన్యూ అధికారులు మళ్లీ సర్వే పనులు చేపట్టారు. సర్వేలో సూళ్లూరుపేట డివిజన్ సర్వే అధికారి ప్రసాద్‌రావు, సర్వేయర్ చంద్రశేఖర్, సత్యవేడు మండల సర్వేయర్లు వీర్వోలు పాల్గొన్నారు.

## భారీ వర్షం


బుచ్చినాయుడుకండ్రిగలో పడుతున్న భారీ వర్షం

**బుచ్చినాయుడుకండ్రిగ:** మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. శనివారం ఉదయం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. మండలంలో 34 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షంతో చెరుకు, మామిడి రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మరికొంతమంది రైతులు వరినాట్లు వేయడానికి పొలాలను సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు.

### సకాలంలో సలహాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న భాస్కరయ్య

**శ్రీకాళహస్తి:** రానున్న రబీ సీజన్లో రైతులకు సకాలంలో సరైన సలహాలు ఇచ్చి ఆదుకోవాలని వ్యవసాయ జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య అన్నారు. పట్టణంలోని ఏపీ సీడ్స్ సమావేశ మందిరంలో రైతు సేవా సిబ్బంది శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరి రకాల ఎంపిక నుంచి నారు పెంపకం, నాట్లు, ఎరువుల యాజమాన్యం, చీడల నివారణపై రైతులకు శాస్త్రీయ సలహాలు అందించాలన్నారు. సేంద్రియ ఎరువుల వాడకం పెంచి రసాయన ఎరువులు, కలుపు మందుల వాడకం తగ్గించాలన్నారు. అనంతరం పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడారు.

### మూడు గ్రావెల్ టిప్పర్లు స్వాధీనం



**నాగలాపురం:** మండలంలోని సురుటుపల్లి వద్ద శనివారం అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న మూడు టిప్పర్లను తిరుపతి భూగర్భ గనుల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్, ఇసుకను తరస్తున్నట్లు అందిన సమాచారం మేరకు కొన్నిచోట్ల స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ఆమె తెలిపారు. అనుమతి లేకుండా గ్రావెల్, ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీజ్ చేసిన మూడు లారీల మీద కేసు నమోదు చేసి స్థానిక పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తామని ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు.

### సిమెంటు రోడ్లకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

**సత్యవేడు:** మండలంలోని చిన్నఈటిపాకం, పెద్ద ఈటిపాకం పంచాయతీలో పల్లెపండుగ కార్యక్రమంలో సిమెంటు రోడ్ల నిర్మాణాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు భూమిపూజ చేశారు. పెద్దఈటిపాకంలో రూ.9.5 లక్షలు, చిన్నఈటిపాకంలో రూ.2.5 లక్షలు, కొల్లడంలో రూ.5 లక్షలతో సిమెంటు రోడ్లు నిర్మించనున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.చంద్రశేఖర్, ఏఈ ఇబ్రహీంఖాన్, ఏపీఓ కృష్ణయ్య, మండల పార్టీ నాయకులు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, నాయకులు వీకేఎస్ పరమశివం(బాషా), శని, సర్పంచులు రూబెన్, గోవిందస్వామి, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

### ఆగమోక్తంగా శనీశ్వరునికి తైలాభిషేకం

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## ప్రొటోకాల్ పాటించరా..!

- పల్లె పండుగకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులను దూరం పెడతారా ?
- అధికారులపై ఆగ్రహం

**బుచ్చినాయుడుకండ్రిగ:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులను దూరం పెట్టడంపై శనివారం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనరు అరణివిద్యానాథరెడ్డి, ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రతిమ, వైస్ ఎంపీపీలు మునికృష్ణారెడ్డి, మున్నెమ్మ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో గత మూడు రోజులుగా పల్లె పండుగ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో రూ.2 కోట్లతో సిమెంట్‌రోడ్లుకు ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు లేకుండానే ప్రొటోకాల్ ఉల్లంఘించి అధికారులు, అధికార పార్టీ నాయకులు భూమి పూజ చేయడం దారుణమన్నారు. మండలంలో అధికశాతం ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీకి చెందిన వారు కావడంతో టీడీపీ నాయకులు పల్లె పండుగకు దూరం పెట్టడం సరికాదన్నారు. సీఎంతో పాటే తాము ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులమని, తమకు గౌరవం ఇవ్వకపోవడం ఏంటిన ప్రశ్నించారు. కనీస సమాచారం ఇవ్వకపోవడంపై వారు మండిపడ్డారు. అధికారులు తీరు మార్చుకోకపోతే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రవి, పుట్టయ్య, సర్పంచ్‌లు జొన్నలరమణమ్మ, సుధాకర్‌నాయుడు, గంగయ్య, వెంకటేష్, చంద్రారెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీల అభివృద్ధిపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

**సత్యవేడు:** ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు గ్రామ పంచాయతీ పాలనపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ ఎస్.చంద్రశేఖర్ అన్నారు. శనివారం రెండు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఎంపీడీఓ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. పంచాయతీలకు వచ్చే నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల్లో ఉపసర్పంచ్, వార్డుమెంబర్లు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకైనందుకు మన వంతుగా ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. పంచాయతీ విస్తరణాధికారి తరుణాక్షరెడ్డి బిల్డింగ్ అప్రూవల్, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, గ్రామ పంచాయతీల ఆస్తుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్లు ఏర్పాటు అంశాలపై అవగాహన కల్పించారు. ఉపసర్పంచులు మాట్లాడుతూ తమకు వేతనాలు ప్రభుత్వం ఇచ్చేలా చర్యలుతీసుకోవాలని కోరారు.

## ప్రసన్న వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు


హోమపూజలు నిర్వహిస్తున్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి

**శ్రీసిటీ(సత్యవేడు):** శ్రీసిటీలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ వార్షికోత్సవాలు శనివారం అత్యంత వేడుకగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. పరిశ్రమల ఉద్యోగులతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఉత్సాహంగా ఉత్సవాల్లో పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం నుంచే వేదపండితుల సంకల్పం, కలశపూజ, పుణ్యాహవచనం, వేదపారాయణం కార్యక్రమాలతో వార్షిక ఉత్సవాలు మొదలైంది. శనివారం తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ, గణపతి హోమం, నవగ్రహ హోమం, మహాసుదర్శన హోమం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హోమపూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద మంత్రోచ్ఛరణల మధ్య చేపట్టిన గోపూజ మహోత్సవం పవిత్ర ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది. భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను మధుసూదన్‌రెడ్డి, పీబీఎస్ శాస్త్రి, పల్లేటి బాలాజీ పర్యవేక్షించారు.




**వరదయ్యపాళెం:** పైచిత్రంలో పొలాల్లో వరినాట్లు వేస్తున్నది ఆడవాళ్లు అనుకుంటే పప్పులో కాలు వేసినట్లే. ఆడవాళ్లకు దీటుగా మేము సైతం అంటూ ఏకంగా మగవారు నాట్లు వేస్తున్న దృశ్యం వరదయ్యపాళెం మండలం సీఎల్ఎన్‌పల్లిలో సాక్షి క్లిక్‌మనిపించింది. ఈ మేరకు పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన వలస కూలీలు 30 మంది మగవారు పొలాల్లో వరినాట్లు వేస్తూ ఔరా ! అనిపించారు. మగవారు వరినాట్లు వేయడాన్ని అటువైపు వెళ్తున్న వారంతా వింతగా చూస్తూ ముక్కున వేలేసుకుంటున్నారు.